నిమ్మ అ'ధర'హో!



గూడూరు మార్కెట్లో నిమ్మకాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సాధారణంగా సెప్టెంబరు మాసంలో కిలో ధర రూ.50 మించదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ముందుగానే కోసేయడంతో ప్రస్తుతం మార్కెట్‌కు కాయలు సరిగా రావడం లేదు. ఈ క్రమంలో అడపాదడపా వచ్చిన కాయలు మంచి ధర పలుకుతున్నాయి. సోమవారం గూడూరు మార్కెట్లో కేజీ రూ.60 నుంచి రూ.110 ధర పలికింది. 50 కేజీల టిక్కీ బస్తా రూ.3వేలు నుంచి రూ.5,500 వరకు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండుకాయలు కేజీ రూ.50 నుంచి రూ.80 పలికాయి. పొడి కాయల(సన్నాలు)కు రూ.50 వరకు ధర లభిస్తోంది. ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే గూడూరు ప్రాంత నిమ్మకాయలు నాణ్యంగా ఉండడంతో వ్యాపారులు ఎగబడుతున్నారు.

- గూడూరు అర్బన్

పవిత్ర ప్రతిష్ఠ



హోమపూజలు చేస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 16: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం పవిత్ర ప్రతిష్ఠతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉత్సవర్లను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. ద్వార తోరణ, ధ్వజకుంభ ఆవాహనం, చక్రాది మండల పూజ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మంగళవారం పవిత్ర సమర్పణ కార్యక్రమం ఉంటుంది. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

మెడిసిన్ అడ్మిషన్స్



మొదటి అడ్మిషన్ అందుకుంటున్న లిఖిత

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 16 : ఎస్వీ వైద్య కళాశాలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. లిఖిత అనే విద్యార్థినికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మొదటి అడ్మిషన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో మొత్తం 140 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఇందులో 18 సీట్లు ఆలిండియా ర్యాంకులో కేటాయిస్తామని చెప్పారు. మిగిలిన సీట్లు రాష్ట్ర కోటా కింద కేటాయిస్తామని తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ మూడు విడతలుగా జరుగుతుందని, ఈనెల 19న సాయంత్రం 3 గంటలకు ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ లోపు సీట్లు పొందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందాలన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి

నలుగురికి బలమైన గాయాలు

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిని బయటపెట్టారనే కోపంతోనే..



గాయపడిన సలీం, ధనంజయ్య, రహీం - సలీంకు కుట్లు వేస్తున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం, సెప్టెంబరు 16: మండలంలోని కల్లూరులో ఆదివారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కల్లూరులో చిట్టిబోయిన చెంగయ్య ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్నాడు. లేని కూలీల పేర్లు నమోదు చేసి, భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఇట్టగుంట నాగప్రసాద్, ఇట్టగుంట ధనంజయ్య, ఎస్కే సలీం, ఎస్కే రహీంలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ సానుభూతిపరుడైన చెంగయ్యను తొలగించాలని కోరారు. ఈ విషయాన్ని చెంగయ్య కల్లూరుకండ్రిగకు చెందిన వైసీపీ నేతలు దార నాగేంద్ర, దార నరేంద్ర, దార హేమంత్, దార ప్రేమకుమార్, నిమ్మల సిసింద్రీలకు చెప్పాడు. వారు ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు పొలం పనుల్లో ఉన్న నాగప్రసాద్‌ను, అతనితో పాటు ఉన్న తోటకూర అంకయ్యలను కొట్టి బైక్‌పై కల్లూరుకండ్రిగకు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని నాగప్రసాద్ ఫోన్ ద్వారా ధనంజయ్యకు సమాచారం ఇచ్చాడు. ధనంజయ్య ఎస్కే సలీం, ఎస్కె రహీంలను వెంటబెట్టుకుని కల్లూరు కండ్రిగకు వచ్చాడు. నాగప్రసాద్‌ను విడిపించాలని కోరగా వైసీపీ నేతలు కర్రలు, రాడ్లతో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. చిన్నపాటి గాయాలతో నాగప్రసాద్ పారిపోగా, మిగిలిన ముగ్గురికి తలపై బలమైన గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న దొరవారిసత్రం ఎస్ఐ అజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని గాయాలైన వారిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడున్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఇలా దాడులు చేయిస్తున్నాడని వారు ఆరోపించారు.

ఇరు వర్గాల ఫిర్యాదు నమోదు

టీడీపీ కార్యకర్తలపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేశామని, అదే సమయంలో వైసీపీ నాయకులు పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా తీసుకున్నామని ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని వివరించారు.





నెల్లూరుపల్లి ఓటిగుంట చెరువు పాతకట్టనే తవ్వి కొత్తదిగా రూపు మార్చారిలా.. - తూతూమంత్రంగా చేసిన అక్కరపాక చెరువు కట్ట పనులు

పాత పనులకు కొత్త కలరింగ్

ఎఫ్‌డీఆర్ వర్క్సులో కాంట్రాక్టర్ల చేతివాటం

దొరవారిసత్రం, సెప్టెంబరు 16: తుఫాను సమయంలో తెగిన చెరువు కట్టలను బాగుచేసుకోవడం కోసం చేపట్టిన పనుల్లో(ఎఫ్‌డీఆర్) కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పాత పనులకు కొత్త కలరింగ్ చేసి, నిధులు స్వాహా చేసేందుకు సిద్ధమయ్యారు. దొరవారిసత్రం మండలంలో అధికారుల అండదండలతో ఈ దందాకు రంగం సిద్ధమైంది. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాను సమయంలో మండలంలో ఎక్కడా చెరువు కట్టలు తెగలేదు. అయితే ఇరిగేషన్ శాఖ అధికారులు 17 చెరువు కట్టలు దెబ్బతిన్నట్లు ప్రతిపాదనలు పంపారు. దీంతో ఎఫ్‌డీఆర్ కింద రూ.92.07 లక్షలు మంజూరయ్యాయి. నాటి వైసీపీ నాయకుల మెప్పుకోసం ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ నిధులు మంజూరు చేయించారు. అయితే పనులు చేస్తే బిల్లులు రావని గ్రహించిన వైసీపీ నాయకులు ఆ పనుల జోలికి వెళ్లలేదు. వాటిని అలాగే వదిలేశారు.

ముఖ్య నాయకుడి సిఫారసులతో..

కొత్త ప్రభుత్వంలో ఆ పనులు చేసేలా ఇరిగేషన్ శాఖ అధికారులు కదలిక తీసుకువచ్చారు. నియోజకవర్గ ముఖ్య నాయకుడి సిఫారసులతో అటు టీడీపీ నాయకులతో పాటు వలస వచ్చిన వైసీపీ వారు పనులను పంచుకున్నారు. మావిళ్లపాడు చెరువు ఆనకట్ట రూ.9.70 లక్షలు, మానేరి కొత్తట్యాంక్ రూ.9.50 లక్షల పనులు మాత్రం టెండరు దశలో ఆగి ఉన్నాయి. మిగిలిన 15 చెరువులకు రూ.4.80 లక్షల నుంచి రూ.4.95 లక్షల అంచనాలతో పనులు పూర్తి చేశారు.

పాత కట్టలకు కొత్త మట్టి..

2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వంలో నీరు చెట్టు పథకంలో చెరువులను బాగా అభివృద్ధి చేశారు. ఇప్పటికీ కట్టలన్నీ బలంగానే ఉన్నాయి. ఎఫ్‌డీఆర్ పనుల్లో భాగంగా మొక్కలను తొలగించడం, పాత కట్టలను యంత్రాలతో తవ్వి కొత్త మట్టితో చదును చేసి పనులు పూర్తి చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. ఎక్కడ కూడా చెరువు కట్టలను బలోపేతం చేసే దిశగా పనులు చేయలేదు.

తాత్కాలిక పనులే కాబట్టి చూస్తాం..

ఎఫ్‌డీఆర్ పనులు తాత్కాలికమే కాబట్టి వాటికి పూర్తి స్థాయిలో బిల్లులు ఉండవు. కాబట్టి కొంత సడలింపు ఉంటుంది. పనులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- శ్రీధర్, డీఈఈ, సూళ్లూరుపేట

ఎంబీయూ విద్యార్థిపై హత్యాయత్నం కేసు..

పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16: తిరుపతిలో శనివారం ఎంబీయూ (మోహన్‌బాబు యూనివర్సిటీ) విద్యార్థిపై హత్యాయత్నానికి పాల్పడిన కార్తీక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎంబీయూలో పారా మెడికల్ కోర్సు చదువుతున్న ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన లోకేష్, సూళ్లూరుపేటకు చెందిన కావ్య తిరుపతిలోని పీజీఆర్ థియేటర్‌లో సినిమా చూస్తుండగా కార్తీక్ హత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. కావ్య, కార్తీక్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో కావ్యతో లోకేష్ స్నేహంగా ఉండడం సహించలేని కార్తీక్ అతన్ని కత్తితో పొట్టలో పొడిచి పారిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు రెండు రోజులుగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. సెల్ సిగ్నల్స్ ఆధారంగా సోమవారం సూళ్లూరుపేటలో అదుపులోకి తీసుకున్నారు. కార్తీక్‌తో పాటు కావ్యను పోలీసులు విచారిస్తున్నారు.

అంగన్‌వాడీలకు ఆగిన కందిపప్పు

రెండు నెలలుగా సరఫరా లేక ఇక్కట్లు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు నెలలుగా కందిపప్పు సరఫరా ఆగిపోయింది. తద్వారా పప్పు లేకుండానే మధ్యాహ్న భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తూకంలో తేడాలు, ప్యాకెట్లలో గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశించిన నేపథ్యంలో కందిపప్పు సేకరణ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలోని 2,131 అంగన్‌వాడీ కేంద్రాలు, 361 మినీ కేంద్రాలకు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కందిపప్పు లేకుండానే మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. నీళ్లతో కూడిన కూరలు తినలేక అవస్థలు పడుతున్నారు. చాలామంది అన్నం కంచాల్లోనే వదిలేసి వెళ్లిపోతున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుమతిని వివరణ కోరగా కందిపప్పు కొనుగోలుకు అవసరమైన కమిటీని వారం రోజుల క్రితమే ఏర్పాటు చేశామని, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

సెలవుల్లో సరదాగా గడుపుదామని వెళ్లి..

బాణసంచా పేలుడులో గాయపడిన బాలుడి మృతి - పిగిలాంలో విషాదఛాయలు



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



ఉమామహేష్ (ఫైల్ ఫొటో)

బాలాయపల్లి, సెప్టెంబరు 16: పాఠశాలకు వరుసగా సెలవులు రావడంతో సరదాగా గడుపుదామని బంధువుల ఇంటికెళ్లాడు. వినాయక చవితి సందర్భంగా గ్రామోత్సవాన్ని తిలకిస్తుండగా జరిగిన బాణసంచా పేలుళ్లలో ప్రాణం పోగొట్టుకుని కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. మండలంలోని పిగిలాం గ్రామానికి చెందిన కందలి శ్రీను, భార్గవిల కుమారుడు ఉమామహేష్(15) వెంకటగిరిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లా మనుబోలులో బంధువుల ఇంటికెళ్లాడు. ఆదివారం మనుబోలు బీసీకాలనీ వద్ద వినాయకుడి గ్రామోత్సవాన్ని తిలకించేందుకు బంధువులతో కలిసి వెళ్లాడు. అక్కడ జరిగిన బాణసంచా పేలుళ్లలో తీవ్రంగా గాయపడడంతో నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చెన్నైకి తరలిస్తుండగా నాయుడుపేట సమీపంలో మృతిచెందాడు. సెలవులకు సరదాగా గడిపేందుకు వెళ్లిన ఉమామహేష్ విగతజీవిగా తిరిగి రావడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. విషాదఛాయల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

ఇంటెలిజెన్సు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16: తిరుపతి రీజనల్ ఇంటెలిజెన్సు ఎస్పీగా వెంకటరాముడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరోలో పనిచేస్తూ తిరుపతికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తుండిన రాఘవేంద్ర కర్నూలు ఇంటెలిజెన్సు ఆర్ఐఓగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటరాముడుకు డీఎస్పీలు కంజాక్షరం, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

మల్లిమడుగు వద్ద అక్రమ మట్టి తవ్వకాల పరిశీలన



మల్లిమడుగు డ్యాం సమీపంలో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

రేణిగుంట, సెప్టెంబరు 16: మల్లిమడుగు డ్యాం గుట్టల నుంచి అక్రమ మట్టి దందాపై ఆంధ్రజ్యోతిలో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వార్త ప్రచురితం కావడంతో సోమవారం ప్రభుత్వ జియాలజిస్టు రవికుమార్, తహసీల్దారు సురేష్‌బాబు, వీఆర్వో కృష్ణపిళ్లై సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల విస్తీర్ణంలో ఎర్రమన్ను దిబ్బలు, రాయి పలకలు తవ్వినట్లు గుర్తించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎర్రమన్ను దిబ్బలు పూర్తిస్థాయిలో తవ్వకాలను గుర్తించారు. చీరాలమ్మ గుట్ట వెనుక ఉన్న మరో గుట్టలో సైతం డ్యాం అంచున ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేసుకుని మట్టిని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

తిరుమలలో అనధికార తట్టల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

తిరుమల, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పలు ప్రాంతాల్లో వెలసిన అనధికార తట్టలను సోమవారం అధికారులు తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల అండదండలతో తిరుమలలో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అనధికార తట్టలు వెలసిన విషయం తెలిసిందే. తాజాగా కూటమి నేతల సహకారంతోనూ పలువురు తట్టలు ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయం ముందున్న అఖిలాండం వద్ద, డీఎంబీ రోడ్డు, పాత అన్నదానం, వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద దాదాపు 13కు పైగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనిపై అధికారికంగా టీటీడీ నుంచి లైసెన్స్‌లు పొంది అద్దె కడుతున్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మీడియాలో విమర్శలు రావడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు టీటీడీ టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమంగా పెట్టిన దుకాణాలను తొలగించారు. మరోసారి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

అలిపిరి వద్ద భారీగా నిలిచిన వాహనాలు



తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద కేంద్రం, లడ్డూ కేంద్రం వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. సర్వదర్శనం కోసం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శనం పడుతోంది. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, గదులు కేటాయించే కౌంటర్లు కూడా రద్దీనే కనిపించాయి. స్లాటెడ్ దర్శనాలు కలిగిన భక్తులకూ రెండు నుంచి మూడు గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు తనిఖీల నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అలిపిరి చెక్ పాయింట్ వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న మెక్సికో బృందం

భాకరాపేట, సెప్టెంబరు 16: ప్రకృతి పద్ధతిలో వ్యవసాయం చేయడం రైతులకు లాభసాటిగా ఉందని మెక్సికో ప్రతినిధుల బృందం కొనియాడింది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మెక్సికో బృందం సోమవారం చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెంలో సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బిల్లావాండ్లపల్లెకు చెందిన రైతు సుబ్రహ్మణ్యం పొలంలో ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఏటీఎం, డీపీఎం మోడల్, ప్రీ-మాన్‌సూన్ సోయింగ్ విధానాలను పరిశీలించారు. పంటల కాలం, పంట దిగుబడి, లభించే ఆదాయం, వాటికి పిచికారి చేసే జీవామృతాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు చంద్రశేఖర్, సురేశ్‌బాబు, స్మిత, రాజగోపాల్, కన్సల్టెంట్ సురేందర్ రెడ్డి, సాంకేతిక అధికారి రవిచంద్ర ప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, అదనపు మేనేజర్ పట్టాభిరెడ్డి, కో-ఆర్డినేటర్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్‌డే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శాస్త్రవేత్త దివాకర్

మంగళం, సెప్టెంబరు 16: తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా సోమవారం ప్రపంచ ఓజోన్ డేను ఘనంగా నిర్వహించారు. ఓజోన్ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత దివాకర్, అడ్మినిస్ట్రేషన్ అశోక్, విశ్లేషకుడు కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవ ప్రాముఖ్యతను, అడ్వాన్స్‌డ్ క్లైమెంట్‌చేంజ్ 2024 థీమ్‌ను వివరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రీజనల్ సైన్స్‌సెంటర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పలువురి శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, సెప్టెంబరు 16: చంద్రగిరి జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద సోమవారం రాత్రి టీడీపీ నేత, ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. తెలుగు యువత నాయకులు జిల్లా నాగార్జునయాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దయ్యయాదవ్, శంకర్, కేశవులు, సురేష్, ప్రశాంత్, కత్తి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుపతి రూరల్, సెప్టెంబరు 16: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడురోజులపాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు సోమవారం సాయంత్రం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం 10గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర కళ్యాణ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 6గంటలవరకు స్వామి, అమ్మవార్లు గ్రామంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, బహుమానం క్రతువులు నిర్వహించి సమర్పణ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, లక్ష్మి దంపతులు, తుడా మాజీ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలు పాల్గొని మొక్కులు చెల్లించారు. రఘునాథరెడ్డి, మంజుల దంపతులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే పాడిరైతుల అభివృద్ధి



పశువుల దాణా అందిస్తున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబరు 16: పాడి రైతుల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తిరువ ం ల రె డ్డి అన్నారు. సోమవారం పీవీపురం గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం జరిగింది. జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం సీజన్‌లో వచ్చే పశువ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. వంద పశువులకు వైద్యసేవలందించి పశుదాణా అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారులు జయకిషోర్, హేమంత్, టీడీపీ జిల్లా నాయకుడు జనార్ధన్‌చౌదరి, రాజేష్, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న పావని

రామచంద్రాపురం, సెప్టెంబరు 16: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు పావని అన్నారు. మండలంలోని రామాపురంలో తల్లిపాల మాసోత్సవాలను సోమవారం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, మునెమ్మ, రుక్మిణి, రూప, దేశమ్మ, వాణిశ్రీ పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ దుర్మరణం

చిట్టమూరు, సెప్టెంబర్ 16: ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ దుర్మరణం చెందిన ఘటన చిట్టమూరు మండలం ఆరూరు గ్రామంలో సోమవారం జరిగింది. మండలంలోని దరఖాస్తు గ్రామానికి చెందిన చల్లా కృష్ణయ్య(50) ఆరూరులోని రైతు అశోక్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తు న్నాడు. ఆదివారం పేడ ఎరువు పొలాలకు తోలేందుకు బాడుగకు వెళ్లాడు. ఎరువు లోడ్‌చేసుకుని పొలాల్లోకి వెళ్లాడు. ట్రాక్టర్ హైగేర్‌లో పెట్టి ట్రాలీలోకి వెళ్లి ఎరువును కిందకు తోస్తుండగా ఎదురుగా గెనెం అడ్డు వచ్చింది. దానిని తప్పించేందుకు ట్రాలీ దిగి నెమ్మదిగా వెళ్తున్న ఇంజన్ లోకి ఎక్కేందుకు ప్రయత్నించే క్రమంలో కాలు జారి ముందు చక్రాల కింద పడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనాస్థలానికి చేరుకొని కృష్ణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.13 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.13 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 85,626 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,138 మంది తలనీలాలు సమర్పించారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల భవనం



పెచ్చులూడిన పాకాల ప్రభుత్వ పశు వైద్యశాల

పాకాల, సెప్టెంబరు 16: మండల కేంద్రమైన పాకాల ఆర్టీసీ బస్టాండు సమీపంలో వున్న ప్రభుత్వ పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పై కప్పులు పెచ్చులూడి వర్షానికి ఉరుస్తోంది. ఇక్కడ అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షణలో రోజూ 25 నుంచి 30 పాడి పశువులకు వైద్య సేవలు అందిస్తారు. వైద్యశాల పరిసరాలు అధ్వానంగా వున్నాయి. మండలంలోని తొమ్మిది సబ్‌సెంటర్‌ల పరిధిలో వైద్య సేవలను ఈ పశువైద్యశాల నుంచే అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షిస్తుంటారు. గత ఆరు నెలల నుంచి మందుల సరఫరా లేకపోవడంతో 90 శాతం మందులను రైతులు బయట మెడికల్ షాపులో కొనుక్కోవలసి వస్తుంది. ప్రభుత్వం స్పందించి వైద్యశాలకు మందులు సరఫరా చేయాలని, శిథిలావస్థలో వున్న భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని పరిసర గ్రామాల పాడి రైతులు కోరుతున్నారు.

ఒకటిన్నర రోజు కంపార్టుమెంట్లలోనే ఉంచేశారు

దేవదాయశాఖ మంత్రితో తమిళ భక్తుడి ఆవేదన



మంత్రితో మాట్లాడుతున్న భక్తుడు

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం ఒకటిన్నర రోజు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలోనే కూర్చోబెట్టారని, కనీసం ప్రసాదాలు, తాగునీళ్లు కూడా ఇవ్వలేదంటూ తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం ఉదయం మంత్రి శ్రీవారి దర్శనం చేసుకుని బయటకు రాగానే మహేష్‌బాబు అనే భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి ముందుకు వచ్చాడు. ఆవేశంగా మాట్లాడుతున్న అతన్ని చూసి మంత్రి సమస్య ఏంటని ప్రశ్నించారు.తాను కుటుంబ సభ్యులతో దర్శనానికి వచ్చానని, 36 గంటలకు పైగా కంపార్టుమెంట్లలోనే కూర్చోబెట్టేశారన్నారు. చంటిబిడ్డలకు పాలిచ్చే తల్లులతో పాటు చిన్నపిల్లలతో వచ్చిన చాలామంది భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, లోపల ఎలాంటి ఏర్పాట్లు లేవని, కనీసం ఎవరు స్పందించడం లేదంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తాను టీటీడీ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తానని చెప్పి వెళ్లిపోయారు.

సామాన్య భక్తులను శ్రీవారి దరికి చేర్చండి : నవీన్

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాన్య భక్తులను శ్రీవారి ద రికి చేర్చేలా చర్యలు తీసుకోవాలంటూ స్థానిక బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన మంత్రిని సోమవారం నవీన్ కుమార్‌రెడ్డి కలిసి తిరుమలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. టీటీడీలో చేపట్టాల్సిన కొన్ని కార్యక్రమాలు, చేయాల్సిన మార్పులపై వినతిపత్రాన్ని అందజేశారు. స్థానికులకు ప్రతి నెల మొదటి మంగళవారం దర్శనం కల్పించే విధానాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన లఘు, మహాలఘు దర్శనాలను రద్దు చేసి ప్రతి సామాన్యుడు గర్భాలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీవాణిట్రస్టు ద్వారా ఇస్తున్న టికెట్‌పై ప్రస్తుతం ఒకరికే దర్శనం ఇస్తున్నారని, ఇకపై ఇద్దరికి దర్శనం ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. టీటీడీ వసతికి కేవలం డిజిటల్ పేమెంట్స్ మాత్రమే తీసుకుంటున్నారని, క్యాష్ కూడా తీసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. గది ఖాళీ చేసిన వెంటనే డిపాజిట్ సొమ్ము ఇచ్చేలా చూడాలన్నారు. తిరుమలలో ఉన్న మఠాల్లో అద్దె గదులు, పెళ్లిళ్ల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీవారిని దర్శించుకునే భక్తులకు ఆధార్‌కార్డుపై రెండు లడ్డూలు మాత్రమే ఇస్తున్నారని, కనీసం పది లడ్డూలు ఇచ్చేలా మార్పులు చేయాలన్నారు. శ్రీవారిసన్నిధిలో ఫారిన్ కరెన్సీ నోట్లను దొంగిలించిన కేసును మూసివేయడంపై సీబీఐ విచారణకు ఆదేశించి దోషులను శిక్షించాలని కోరారు. ఇదే విధంగా పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందిస్తూ టీటీడీ ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి సామాన్య భక్తులకు మెరుగైన సేవలందించే కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

నిశ్చితార్థ వేడుకలకోసం క్యూలైన్ల తొలగింపు

- పల్లికొండేశ్వరాలయంలో వైసీపీ నేత నిర్వాకం



ప్రదోష మండపం వద్ద వైసీపీ నేత కట్ చేసిన గ్రిల్ అడుగు భాగం, తొలగించిన గ్రిల్‌ను మళ్లీ దారంతో కట్టిన దృశ్యం

నాగలాపురం, సెప్టెంబరు 16: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మాజీ ఛైర్మన్ ఏఎంసీ బాలాజీరెడ్డి మరో నిర్వాకం వెలుగు చూసింది. ప్రదోష మండపంలో తన కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు అడ్డుగా ఉందని దాతల సాయంతో ఏర్పాటు చేసిన క్యూలైన్లను కట్ చేసి తొలగించిన వైనం బయటపడింది. నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో వున్న ప్రదోష మండపంలో ఆదివారం వైసీపీ నేత బాలాజీ రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకలు జరిగిన విషయం తెలిసిందే.వచ్చిన బంధుమిత్రులను ఏకంగా కుర్చీలు వేసి కూర్చోబెట్టడం విమర్శలపాలైంది.వేడుకలను వీక్షించేందుకు అడ్డుగా ఉందని ప్రదోష మండపం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టీల్ క్యూలైన్లను కట్ చేసి తొలగించి వుండడం సోమవారం చూసి నవాళ్లంతా నోరెళ్లబెట్టారు.ఆలయంలో జరిగే ప్రదోష పూజలకు, మహా శివరాత్రి వంటి విశేష రోజుల్లో భక్తుల రద్దీని కట్టడి చేసేందుకు నలుగురు దాతలందించిన సుమారు 15 లక్షల రూపాయలతో స్టీల్ గ్రిల్స్‌తో ఆలయంలో పలు చోట్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు.అటువంటి క్యూలైన్లను తొలగించడంపై భక్తులు మండిపడుతున్నారు. ఆలయ సిబ్బంది క్యూలైన్‌ను కట్ చేయవద్దని అభ్యంతరం తెలిపినా కూడా తొలగించినట్లు సమాచారం.రాష్ట్రంలో ప్రభుత్వం మారి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంకా వైసీపీ నేతల హవా కొనసాగుతుండడం, అధికారులు ఇంకా వారి చెప్పు చేతల్లోనే ఉన్నారనడానికి ఈ వుదంతం ఓ నిదర్శనం. వైసీపీ ప్రభుత్వ హయాం లో బాలాజీరెడ్డి పల్లికొండేశ్వరాలయ ఛైర్మన్‌గా సంస్కరణల పేరుతో ఎన్నో అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడంపై అప్పట్లో వివాదాలు చెలరేగాయి. అయితే ఆయన పలుకుబడి కలిగిన నాయకుడవడంతో అధికారులు వారించే సాహసం చేయలేకపోయారు. అయితే ప్రభుత్వం మారినా ఆలయంలో ఆయన హవాయే ఇంకా కొనసాగుతుండడం ఆశ్చర్యకరం.


బస్సులో బంగారం చోరీ

విచారిస్తున్న పోలీసులు



బాధితురాలు

చిత్తూరు, సెప్టెంబరు 16: బస్సులో ఓ మహిళ బ్యాగులో ఉన్న బంగారం చోరీ అయిన సంఘటన సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన ప్రేమ అనే మహిళ కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. రెండ్రోజుల కిందట తిరుపతిలో పెళ్లి ఉండటంతో కుటుంబంతో కలిసి వచ్చారు. పెళ్లి చూసుకుని సోమవారం సాయంత్రం కర్ణాటక ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు బయల్దేరారు. బస్సు చిత్తూరుకొచ్చాక బంగారు నగలున్న బ్యాగు కనడపడలేదు. దీంతో ఆమె చుట్టుపక్కల ఉన్న వారిని అడిగినా ఫలితం లేదు. అప్పటికే బస్సు చిత్తూరు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు చేరింది. ఈ విషయాన్ని పోలీసులకు బాధితులు చెప్పారు. పోలీసులు కూడా ప్రయాణికులను తనిఖీ చేశారు. వారి వద్ద బ్యాగు లేకపోవడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు. కాగా.. గిల్ట్ నగలున్న బ్యాగు మాత్రమే తమ ఉందని బాధితులు చెబుతున్నారు. దీంతో బంగారం నగలను మర్చిపోయి తిరుపతిలోనే వదిలేశారా లేదా మరెక్కడైనా పెట్టేశారా చూడాలని పోలీసులు చెప్పడంతో బాధితులు ఫిర్యాదు ఇవ్వకుండానే వెళ్లిపోయారు.



పూజాద్రవ్యాలు తీసుకెళ్తున్న అర్చకులు

ఆగమోక్తంగా పవిత్రోత్సవం



పూజలు చేస్తున్న వేదపండితులు - పూజా ద్రవ్యాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: ముక్కంటీశుడి ఆలయంలో పవిత్రోత్సవాలు నాల్గో రోజు సోమవారం ఆగమోక్తంగా జరిగాయి. నిత్యపూజల్లో జరిగే దోషాలను నివారించేందుకు యేటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయంలోని యాగశాల వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవ మూర్తులను ఉంచి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, ఎమ్మెల్సీ రఘువర్మ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, శిల్పా రవికిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీలు అనురాధ, ఎంవీవీ సత్యనారాయణ, సెంట్రల్ హెల్త్ సెక్రటరీ అపూర్వ చంద్ర, ఐసీఎల్ఎఫ్ నార్త్ స్టేట్స్ జాయింట్ సెక్రటరీ వినోద్ శర్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

తెలంగాణా ప్రజల శ్రేయస్సు కోసమే సీఎం హైడ్రా పెట్టారు : దానం నాగేంద్ర

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను పెట్టారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేంద్ర అన్నారు. తెలంగాణాలో చాలా ప్రాంతాలు, చెరువులు అన్యాక్రాంతమయ్యాయన్నారు. అనేక ప్రదేశాల్లో కబ్జాలను తొలగించేందుకు హైడ్రా తీసుకువచ్చామన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. విభజన తర్వాత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీని పట్టుకుని బీఆర్ఎస్ నేత కౌశిక్‌రెడ్డి ఆంధ్రాకు చెందిన ఎమ్మెల్యే అంటూ మాట్లాడటం దారుణమన్నారు.

నవజీవన్‌లో పండ్ల పంపిణీ



విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచుతున్న సామంచి శ్రీనివాస్ తదితరులు

తిరుచానూరు, సెప్టెంబరు 16: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పుట్టినరోజును పురస్కరించుకుని తిరుచానూరు సమీపంలోని నవజీవన్ ఆశ్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వృద్ధులు, పిల్లలకు పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆశ్రమ నిర్వాహకులు శ్రీధర్ ఆచార్యులు, బీజేపీ నాయకులు నవీన్‌రాయల్, పార్థురెడ్డి, బాబు, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మాజీ గవర్నర్ నరసింహన్



తిరుచానూరు, సెప్టెంబరు 16: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షేర్ ఆటోలో నుంచి జారిపడి ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలైన చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 16: చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలో తిరుపతి-చంద్రగిరి రహదారిలో ఓవ్యక్తి షేర్ ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... చంద్రగిరి మండలం, మల్లయ్యపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి తిరుపతిలోని ఒక లాడ్జిలో పనిచేస్తున్నాడు. సోమవారం తన పనులను ముగించుకుని ఇంటికి రావడానికి తిరుపతిలో షేర్ ఆటోలో వెనుక భాగంలో ఎక్కాడు. మార్గమధ్యంలో తొండవాడ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు రోడ్డుపై పడ్డాడు. ఈప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్ర రక్త గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. వరుస సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 33వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,236మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,584మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,726మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,454, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 468మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 286మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 69మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,993 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలను ఆచరిద్దాం



అన్నదానం చేస్తున్న మేయర్ శిరీష, సయ్యద్ షఫీ అహమ్మద్ ఖాద్రి తదితరులు

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 16: మానవ సమాజంలో శాంతికోసం మహమ్మద్ ప్రవక్త చేసిన బోధనలను ఆచరిద్దామని సయ్యద్ షఫీ అహమ్మద్ ఖాద్రి అన్నారు. స్థానిక కృష్ణాపురం ఠాణా వద్ద మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జయంతి) పర్వదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని మేయర్ శిరీష, షఫీ అహమ్మద్ ఖాద్రిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహమ్మద్ ప్రవక్త 1453వ జయంతి రోజున పేదలకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని మేయర్ శిరీష ప్రారంభించడం భిన్నత్వంలో ఏకత్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు డాక్టర్ అమీనుల్లా ఖాద్రి,షేక్ మిర్జాసర్వరీ,సయ్యద్ ఆరిఫుల్లా హుసేని, కేఎస్. ముర్తుజా, ఎస్.చాన్‌బాషా, ఎస్.తఖీఖాద్రి, ఎస్.వజీర్, రఫీ, ఎస్.గఫూర్, డాక్టర్ అంజాద్, జీరే మునీర్, హజరత్ జుబేర్ హయాత్, మహబూబ్‌బాషా, జాకీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోవిందరాజుల పవిత్రోత్సవాలు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 16: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో గత మూడురోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాల సేవ, సహస్రనామార్చన జరిగాయి. ఆ తరువాత శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని ఆలయంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ ఉదయం 10.30 గంటల నుంచి స్నపన తిరుమంజనం నిర్వహించారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి స్వామి వారి ఉత్సవ మూర్తులను ఆలయ నాలుగు మాడవీధులలో ఊరేగించారు. తరువాత యాగశాలలో జరిగిన వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

జాతీయసదస్సుకు హాజరైన ఎన్‌ఎస్‌యూ వీసీ



మాట్లాడుతున్న వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 16: నాగపూర్‌లోని కవికులగురు కాళిదాస సంస్కృతవర్సిటీలో నిర్వహించిన జాతీయ బుద్ధిస్ట్ సదస్సుకు తిరుపతికి చెందిన సంస్కృతవర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈమేరకు వర్సిటీ ఏపీఆర్వో డాక్టర్ కె.కుమార్ పేర్కొన్నారు. బుద్ధిస్ట్ ఫిలాసఫీ ప్రస్తుత సమాజానికి ఎంతగానో దోహదపడుతుందని, బౌద్ధుని ఆదర్శాలను పాటిస్తూ.. సామాజిక అభివృద్ధికి, దేశ సంరక్షణకు ముందుకు సాగాలని వీసీ ఉపన్యసించారని పేర్కొన్నారు.

తిరుమలలో తట్టల గోల వైసీపీ పనే



మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 16: తిరుమల శ్రీవారి సన్నిధిలో అనధికార హాకర్లకు జనసేన పార్టీకి ఎలాంటి సంబంధంలేదని ఆ పార్టీ తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్ చెప్పారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం పార్టీ శ్రేణులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమ పార్టీ పేరు చెప్పి వైసీపీ వాళ్లే తిరుమలలో తట్టలు పెడుతున్నారని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో వందల సంఖ్యలో ఉన్న తట్టలు, షాపులు వేల సంఖ్యలోకి చేరుకున్నాయన్నారు. లైసెన్సులు, అనుమతులు సక్రమంగా లేని వారిని తమ కూటమి ప్రభుత్వంలో టీటీడీ విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు. కూటమికి సంబంధించిన వారెవ్వరూ అనధికారికంగా వ్యాపారాలు చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. కొందరు పనిగట్టుకుని తమ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తిరుమలలో అవినీతికి అవకాశం లేకుండా, పవిత్రతను కాపాడేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. జనసేన నాయకులు హరి, మనోజ్, కిషోర్, సాయి దేవ్, గోపి, సిద్ధు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ శాఖ బైపాస్‌రోడ్డులోకి మార్పు



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ధారాసింగ్ నాయక్ తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), సెప్టెంబరు 16: స్థానిక జీకార్‌వీధిలో ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖని తిరుమల బైపాస్‌రోడ్డులోని టీఎంఆర్ కళ్యాణ మండపం సమీపంలోకి మార్పు చేసినట్లు బ్రాంచ్ హెడ్ బి.రాజ్‌కమల్ పేర్కొన్నారు. సోమవారం దీన్ని జోనల్ మేనేజర్ ధారాసింగ్‌నాయక్, గుంటూరు రీజనల్ హెడ్ వెంకటేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఖాతాదారులు బ్యాంకు మార్పుచేసిన విషయాన్ని గమనించి సేవలు పొందాలని బ్రాంచ్ హెడ్ కోరారు.

రేపు ఎస్వీయూలో హెడ్స్, బీఓఎస్‌ల సమావేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16: ఎస్వీయూనివర్సిటీలోని అన్ని విభాగాల హెడ్‌లు, బీఓఎస్ ఛైర్మన్ల సమావేశం ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సెనేట్ హాల్లో నిర్వహించనున్నారు. పీజీ ఫస్టియర్ తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన సిలబస్, నమూనా ప్రశ్నాపత్రం రూపకల్పన తదితర అంశాలపై ఈ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిసింది. యూనివర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీల పరిధిలోని హెడ్స్, బీఓఎస్ ఛైర్మన్లు ఈ సమావేశంలో పాల్గొనాలని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు అధికారిక ఉత్తర్వులు వెలువరించారు.

20న ఎస్వీయూ పాలకమండలి సమావేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16: ఎస్వీయూ పాలకమండలి సమావేశం ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్టు సమాచారం. యూనివర్సిటీలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలే ప్రధాన అజెండాగా పాలకమండలిలో చర్చించే అవకాశం ఉంది. సమావేశం నిర్వహణపై అటు ప్రభుత్వ ఉన్నతాధికారులకూ, ఇటు పాలకమండలి సభ్యులు, అధికారులకు ఆహ్వానం పంపినట్టు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన తర్వాత నిర్వహిస్తున్న ఈ పాలకమండలి సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. పాలకమండలి ఎలాంటి తీర్మానాలు చేస్తుందనే విషయమై యూనివర్సిటీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పాలకమండలి సమావేశం నిర్వహణకు అవసరమైన ఏర్పాటపై వర్సిటీ అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో కలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 16: రాష్ట్రంలో పని చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో కలపాలని జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... స్కూల్ కాంప్లెక్స్ రీ-ఆర్గనైజేషన్ అంశంలో ప్రభుత్వంతో చర్చించిన అనంతరం ముందుకు సాగాలని కోరారు. అగ్రిమెంట్ బాండ్ విధానం రద్దు కోసం ఉద్యోగులు ఐక్యమత్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, హెచ్‌ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిరుద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు డాక్టర్ బి.నాగరాజు, కాంతారావు, జి.చిన్నబాబు, జయచంద్ర, జి.నాగవెంకటేష్, సూర్యకుమారి, శివ, కృష్ణకుమారి, గంగులప్ప, కరుణాకర్, వెంకటరమణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఓజోన్ పొరను రక్షించడం మన బాధ్యత



ప్రదర్శనలో పాల్గొన్న రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 16: ఓజోన్ పొరను రక్షించడం మన బాధ్యత అని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ లింగుట్ల రమేష్ నాథ్ అన్నారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరానికి చెందిన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో ప్రదర్శనలు నిర్వహించారు. బాలాజీ కాలనీ నుంచి ఎంఆర్‌పల్లి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓజోన్ పొరను రక్షించుకోవడానికి ప్రకృతి ప్రేమికులు, సామాజిక కార్యకర్తలు కలిసి ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు రమేష్ నాథ్ తెలిపారు. రీచ్ గ్లోబల్ ప్రతినిధి డాక్టర్ దేవరాజులు, డాక్టర్ పైడి అంకయ్య, బాషా, బాలాజీ, దాము, వేణు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరుకున్న బస్టాప్‌లు, బస్టాప్‌లో రంధ్రాలు పడిన కుర్చీలు

మినీ బస్టాప్‌ల మరమ్మతులకు ఫుల్‌స్టాప్!

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 16: కరకంబాడిరోడ్డుకు ఇరువైపులా ఉన్న మినీబస్టాప్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. 20 ఏళ్లక్రితం క్రితం నాటి ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి వినాయకసాగర్ నుంచి టీఎన్ పాళెం, గొల్లపల్లె, వెంకటేశ్వరకాలనీ, మంగళం, సప్తగిరినగర్, మిట్టగాంధీపురం, చెన్నాయగుంట, మంగళం క్వార్టర్స్, యాదవ్‌కాలనీ, బీటీఆర్‌పురం, తుడా క్వార్టర్స్, రామచంద్రనగర్, గంగాదేవికాలనీ, కేబీఆర్‌నగర్, తిరుమలనగర్, బీటీఆర్ నగర్, నేతాజీనగర్, రణధీరపురం, బొమ్మలక్వార్టర్స్, శెట్టిపల్లి, కోళ్లఫారం, వెంకటాపురం వరకు కరకంబాడి రోడ్డుకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేయించారు. కాలక్రమేణా ఒకటి, రెండు మినహా మిగిలినవన్నీ మరమ్మతులకు గురయ్యాయి. శిథిలావస్థకు చేరుకున్నాయి. షెల్టర్లలో ఏర్పాటుచేసిన ఇనుప కుర్చీలకు రంధ్రాలు ఏర్పడ్డాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. కొన్ని చోట్ల కింద కుర్చీలే లేవు. వీటి పరిస్థితిని గమనించి కొందరు అక్కడ టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. రాత్రి వేళ మందుబాబుల కార్యకలాపాలకు ఇవి వేదికగా మారుతున్నాయి. కొందరు ఏకంగా పశువులను కట్టేస్తున్నారు. మరికొందరు అనధికార వాహనాల పార్కింగ్‌గా ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ మినీ బస్టాప్‌లకు మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు. మున్సిపల్, తుడా స్పందించి తక్షణమే మినీబస్టాప్‌లను బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి



ఉమ ముద్దుబాలను సత్కరిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 16: భారతరత్న, దివంగత సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతిని తిరుపతిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గతంలో శ్రీనివాస సేతు నిర్మాణ సమయంలో పూర్ణకుంభం కూడలిలోని సుబ్బులక్ష్మి విగ్రహాన్ని తరలించిన విషయం తెలిసిందే. కాగా రెండు రోజుల క్రితం పలువురు సంగీతాభిమానులు, అధికారులు తిరిగి విగ్రహాన్ని గతంలో ఉన్నట్టుగానే పూర్ణకుంభం కూడలిలో పునఃప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. ఈ విగ్రహానికి సోమవారం ఉదయం నగర మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమ ముద్దుబాల, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సంగీత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఎంఎస్ సుబ్బులక్ష్మి గానం చేసిన కీర్తనలతో సభ నిర్వహించి, ఘన నివాళి అర్పించారు. అలాగే కోదండరామాలయం సమీపంలోని చిగోర ఆధ్యాత్మిక కేంద్రంలో కూడా సుబ్బులక్ష్మి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమితి నాయకులు హనుమంతరావు, రాజ్యలక్ష్మి, శేషగిరిరావు, క్రెడిట్ సొసైటీ సభ్యులు పాల్గొని నివాళి అర్పించారు. రాయల సీమ రంగస్థలి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు గుండాల గోపినాథ్ రెడ్డి, విద్వాన్ కప్పా పద్మనాభం, రాజ్యలక్ష్మి, జేజిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, సుధాకర్, వాసు, చంద్రబాబు నాయుడు పాల్గొని ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

ఆమె జీవితం ఆదర్శనీయం



యూత్ హాస్టల్లో ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి వేడుకలు

తిరుపతి (జీవకోన): సంగీత విద్వాంసురాలు, గాయని, భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితం అందరికీ ఆదర్శనీయమని వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం అన్నారు. స్థానిక యూత్ హాస్టల్‌లో సోమవారం నిర్వహించిన ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి వేడుకల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ ఎంఎస్ సుబ్బులక్ష్మి తన సంగీత ప్రదర్శనలతో యావత్ ప్రపంచాన్ని మైమరిపించిందని తెలిపారు. రామన్ మెగాసెసే అవార్డు పొందిన తొలి భారతీయురాలు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిరత్నం, గోవిందంశెట్టి, లక్ష్మయ్య, రామచంద్రయ్య, మునిరత్నం, ఎల్ఆర్ సుబ్రహ్మణ్యం, ఎల్లయ్య, శంకర, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

23వరకు నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 16: జాతీయస్థాయిలో 2025-26 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వతరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువుని ఈనెల23వరకు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే విధానం, ప్రవేశపరీక్షకు సంబంధించిన ఇతర వివరాలకోసం తిరుపతిలోని వరదరాజనగర్‌లోని విశ్వం పోటీపరీక్షల సమాచార కేంద్రంలో పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 86888 88802/93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు.

ఇంక్రిమెంట్ కట్ చేసి మానసికంగా వేధించారు!

ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న కోపం అలా తీర్చుకున్నారు!! - పూర్వ డీఐజీ అమ్మిరెడ్డిపై రిటైర్డు డీఎస్పీ నరసప్ప ఫిర్యాదు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 16: తాను ఎలాంటి తప్పు చేయకున్నా ఇంక్రిమెంట్ కట్ చేసి మానసికంగా వేధించారంటూ తిరుపతికి చెందిన రిటైర్డు డీఎస్పీ బి.నరసప్ప ఇదివరకటి అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిపై అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుపతిలో ముందస్తు సమాచారం ఇవ్వకుండా వచ్చి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న కోపం తనపై అలా తీర్చుకున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. నరసప్ప ఫిర్యాదులో పేర్కొన్న మేరకు.... బి.నరసప్ప 2021 మే 28 నుంచీ 2023 మే 3వ తేదీ వరకూ తిరుపతి వెస్ట్ డీఎస్పీగా పనిచేశారు. ఆ మధ్యలో అంటే గతేడాది మార్చి 13న రాయలసీమ తూర్పు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఆ సందర్భంగా నరసప్పను వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని 31 పోలింగ్ కేంద్రాలకు గానూ పోలీస్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఇంచార్జిగా పై అధికారులు నియమించారు. పోలింగ్ రోజున వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బజారు వీధి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 229వ నంబరు పోలింగ్ కేంద్రంలోకి మధ్యాహ్నం 2 గంటలకు కొందరు ప్రవేశించి బ్యాలెట్ పత్రాలకు లాక్కుని దొంగ ఓట్లు వేశారు. దానివల్ల ఆ పోలింగ్ కేంద్రంలో అదే నెల 15న రీ పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. మార్చి 13న జరిగిన పోలింగ్ సందర్భంగా బందోబస్తులో పోలీసు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే రీపోలింగ్ జరపాల్సి వచ్చిందని అదనపు ఎస్పీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నరసప్పతో సహా సంబంధిత పోలీసులు, ఎస్ఐలు, సీఐలకు ఛార్జి మెమోలు జారీ చేసిన ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి డీఎస్పీ నరసప్పపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ డీజీపీకి నివేదించారు. అయితే దీనిపై ఎన్నికల కమిషన్ తిరుపతి ఎస్పీని గతేడాది ఏప్రిల్ 4న వివరణ కోరింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందికి, అధికారులకు ఛార్జి మెమోలు జారీ చేశామంటూ ఎస్పీ ఇచ్చిన వివరణతో తృప్తిపడని ఎన్నికల కమిషన్ వారిని సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశించింది. దీంతో సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద డ్యూటీలో వున్న ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, పోలీసు, మహిళా పీసీ, హోమ్ గార్డులను సస్పెండ్ చేశారు. ఆపై తిరుపతి ఎస్పీ ఆదేశాలతో జరిగిన విచారణలో నరసప్ప ఆధ్వర్యంలో పనిచేసిన స్ట్రైకింగ్ ఫోర్స్ నిర్లక్ష్యం లేదని తేల్చి వారికి అదివరకూ జారీ చేసిన ఛార్జి మెమోలను వెనక్కు తీసుకున్నారు. అయితే ఈ ఏడాది జనవరి 6న అప్పటి అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి నుంచీ నరసప్పకు ఛార్జి మెమో జారీ అయింది. దానిపై అదే నెల 21న నరసప్ప డీఐజీని వ్యక్తిగతంగా కలసి తన నిర్లక్ష్యం లేదని వివరణ ఇచ్చినప్పటికీ డీఐజీ సంతృప్తి చెందకుండా నరసప్పకు ఏడాది పాటు ఇంక్రిమెంట్ కోత విధించారు. ఈ అంశాలన్నింటినీ ఫిర్యాదులో ప్రస్తావించిన రిటైర్డు డీఎస్పీ నరసప్ప 2023 డిసెంబరు 22న డీఐజీ అమ్మిరెడ్డి తిరుపతికి వచ్చినపుడు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నారని, ఆ కోపాన్ని తనపై ఇలా తీర్చుకున్నారని ఆరోపించారు. ఆ రోజున డీఐజీ ముందస్తు సమాచారం లేకుండా తిరుపతికి వచ్చారని పేర్కొన్నారు. తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేసే కౌంటర్ల వద్ద బందోబస్తుకు అధిక సంఖ్యలో పోలీసులను నియమించడం జరిగిందని, అదే రోజు ప్రభాస్ నటించిన సలార్ సినిమా అన్ని థియేటర్లలో విడుదల చేయడంతో అక్కడా అధికంగా పోలీసులను పెట్టాల్సి వచ్చిందని వివరించారు. అదే రోజు డీఐజీ అమ్మిరెడ్డి ముందుగా సమాచారం ఇవ్వకుండా తిరుపతికి వచ్చి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారని వివరించారు. శ్రీనివాసం వద్దకు వచ్చి ఆ కోపాన్ని తనపై చూపించి నడిరోడ్డుపై బండబూతులు తిట్టి వెళ్లారని ఆరోపించారు. దాన్ని మనసులో వుంచుకుని తన తప్పు లేకున్నా ఛార్జి మెమో జారీ చేసి ఇంక్రిమెంట్ కోత విధించారని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ వివరాలు సేకరించడానికి ఆలస్యం జరిగిందని, అందువల్లే ఆలస్యంగా ఫిర్యాదు చేస్తున్నానని పేర్కొన్నారు. మంచి రికార్డుతో 40 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి 338 రివార్డులు, సేవా పతకం, ఉత్తమ సేవా పతకం, మహోన్నత సేవా పతకం పొంది శాఖలో గౌరవంగా గడిపిన తన పరువు తీసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని డీఐజీ అమ్మిరెడ్డిపై ఆరోపణ చేశారు.

రిటైరవుతున్న సమయంలో..

రిటైరవుతున్న సమయంలో తనకు శిక్ష వేసి మానసిక వేదన కలిగించి నిద్ర లేని రాత్రులు గడపడానికి కారకులయ్యారని ఆరోపించారు. తన ఫిర్యాదు మేరకు డీఐజీ అమ్మిరెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. కాగా దీనిపై అలిపిరి సీఐ రామ్‌కిశోర్‌ను వివరణ కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యువశ్రీకి పురస్కారం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న డాక్టర్ యువశ్రీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16: పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగ అధ్యాపకురాలు డాక్టర్ డి.యువశ్రీ ఉత్తమ అధ్యాపక పురస్కారం (ఆచార్య దేవోభవ జాతీయ పురస్కారం) పొందారు. సర్వేపల్లె రాధాకృష్ణన్ 137వ జయంతి సందర్భంగా తిరుపతిలోని యువతేజం ట్రస్ట్ - ఢిల్లీలోని కలాం విజన్ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. సర్వేపల్లె రాధాకృష్ణన్ మనవడు సుబ్రమణ్యం శర్మ, ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ రత్నయ్య చేతుల మీదుగా శాలువా, పుష్పగుచ్ఛం, సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యువశ్రీని పలువురు అభినందించారు.

విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు తొలగించండి



మాట్లాడుతున్న ఈఈ వాసుదేవరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 16: తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో వున్న విద్యుత్ స్తంభాలకు అనధికారంగా కట్టివున్న డిష్ కేబుల్, ఇంటర్నెట్ కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని ఈఈ కె.వాసుదేవరెడ్డి ఆదేశించారు. స్థానిక చేపల మార్కెట్ సమీపంలో వున్న ఈస్ట్ సెక్షన్‌లో సోమవారం ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థతో సంబంధం లేకుండా వున్న కేబుల్ వైర్లను ఆయా సంస్థల నిర్వాహకులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. అస్తవ్యస్తంగా వున్న కేబుళ్ల ద్వారా తొండలు, బల్లులు, ఉడతలు ప్రాకుతూ విద్యుత్ వైర్లను తాకి ప్రాణాలు పోగొట్టుకోవడంతో పాటు, విద్యుత్ అంతరాయాలకు కారణమవుతున్నాయని ఆయన వెల్లడించారు. ఇలాంటి కారణాలతో విద్యుత్ నియంత్రికలు కాలిపోతున్నాయని తెలిపారు. తమ సంస్థ అనుమతులు లేనివారు ఏఈలను సంప్రదించాలని కోరారు. అనధికారంగా వున్న కేబుళ్లను వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించారు. లేని పక్షంలో శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుపతి-2 డీఈఈ మునిప్రసాద్, ఏఈలు శ్రీనివాసరాజు, వెంకటరమణ లు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ దుర్మరణం


మృతి చెందిన కృష్ణయ్య

చిట్టమూరు, సెప్టెంబర్ 16: ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ దుర్మరణం చెందిన ఘటన చిట్టమూరు మండలం ఆరూరు గ్రామంలో సోమవారం జరిగింది. మండలంలోని దరఖాస్తు గ్రామానికి చెందిన చల్లా కృష్ణయ్య(50) ఆరూరులోని రైతు అశోక్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం పేడ ఎరువు పొలాలకు తోలేందుకు బాడుగకు వెళ్లాడు. ఎరువు లోడ్‌చేసుకుని పొలాల్లోకి వెళ్లాడు. ట్రాక్టర్ హైగేర్‌లో పెట్టి ట్రాలీలోకి వెళ్లి ఎరువును కిందకు తోస్తుండగా ఎదురుగా గెనెం అడ్డు వచ్చింది. దానిని తప్పించేందుకు ట్రాలీ దిగి నెమ్మదిగా వెళ్తున్న ఇంజన్ లోకి ఎక్కేందుకు ప్రయత్నించే క్రమంలో కాలు జారి ముందు చక్రాల కింద పడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలానికి చేరుకొని కృష్ణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బంగారు ఆభరణాల స్వాధీనం


పట్టుబడ్డ నిందితుడు, ఆభరణాలతో సీఐ బాబి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఈ నెల 8వ తేదీ జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. శ్రీరామ్‌కాలనీలో నివాసం ఉంటున్న తిరుపాల్ ఇంట్లో నిద్రిస్తుండగా 8 సవర్ల బంగారు ఆభరణాలు, ఒక ల్యాప్‌టాప్, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సోమవారం గోమతి సెంటర్ వద్ద పెళ్లకూరు మండలం దిగువచావాలి గ్రామానికి చెందిన చైతన్యను అరెస్టు చేసి, అతని దగ్గర నుంచి బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, ప్రొవిజనల్ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరచిన పోలీస్ సిబ్బంది పోలయ్య, చిరంజీవి, వెంకటేశ్వర్లను సీఐ అభినందించారు.

ఆత్మహత్యకు కారణమైన ఇద్దరి అరెస్టు

చిట్టమూరు, సెప్టెంబర్ 16: తన చావుకి ఇద్దరు కారణమంటూ ఓ వ్యక్తి మొబైల్‌లో రికార్డు చేసిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఇద్దరిని అరెస్టు చేశారు. చిట్టమూరు మండలం దరఖాస్తు గ్రామానికి చెందిన చల్లా చెంగయ్య ఆగస్టు 27వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి తిరుపతిలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఈనెల 8న చంగయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు చెంగయ్య మొబైల్‌ను పరిశీలించగా సూసైడ్‌కు సంబంధించిన వీడియో బయట పడింది. తన భార్య దేవసేన, అదే గ్రామానికి చెందిన మల్లి కస్తూరయ్య మధ్య అక్రమ సంబంధం కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని చెంగయ్య వీడియో రికార్డు చేశాడు. దీంతో చెంగయ్య బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెంగయ్య భార్య దేవసేన, కస్తూరయ్యను సోమవారం అరెస్టు చేసి కోట కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ చిన్నబలరామయ్య తెలిపారు.

బైక్‌ల చోరీ కేసుల్లో ఇద్దరికి రిమాండ్

తడ, సెప్టెంబరు 16: బైక్‌లు చోరీచేసే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక నిప్పో పరిశ్రమ ఎదురుగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి పట్టుకునే ప్రయత్నించగా కత్తితో దాడి చేసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. సూళ్లూరుపేట మండలం తేవలతేరికట్ట గ్రామానికి చెందిన కంచి వంశీ, అదే మండలం కొమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన బందిలి సూర్యనారాయణ అలియాస్ మిరకాయగా తెలిసింది. వారి వద్ద ఉన్న రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో రెండు హత్యాయత్నం కేసులతో పాటు, మరికొన్ని కేసులు ఉన్నట్లుగా విచారణలో తేలింది. నిందితులిద్దరినీ సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన



అన్నా క్యాంటీన్ పరిశీలిస్తున్న కమిషనర్

నాయుడుపేట, సెప్టెంబరు 16: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ జనార్దన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

కార్మికుల సంక్షేమమే ఎస్‌డబ్ల్యూఎఫ్ ధ్యేయం


జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 16: ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ఎస్‌డబ్ల్యూఎఫ్ ధ్యేయమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటాలు సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శేషయ్య, రఘురామయ్య, రమణయ్య, గురువయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సురేష్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని ఆర్టీసీ డిపో వద్ద సాఫ్ట్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. డీవీ రమణయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రీజనల్ సహాయ కార్యదర్శి ఎస్ఆర్ చంద్రయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో సాఫ్ట్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు వారధిగా నిలిచిందని ప్రశంసించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి నజీర్‌బాషా, సహాయ కార్యదర్శి బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


ఆదెమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం మండల పరిధిలోని దావాది గుంటకు చెందిన చందనమూడి ఆదెమ్మ(75) మరణించడంతో ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో చెన్నై శంకర నేత్రాలయకు నేత్రదానం చేశారు. కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, ఆలపాటి అశోక్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: సూళ్లూరుపేట పట్టణం నడిబొడ్డులో ఓ చిల్లర దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.... బాపూజీ వీధిలోని గాంధీకి దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డాడు. గల్లా పెట్టెలో రూ.500 నగదు ఎత్తుకెళ్లాడు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు మట్టి టిప్పర్ల స్వాధీనం

దొరవారిసత్రం, సెప్టెంబరు 16: దొరవారిసత్రం మండలం నెలబల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లును నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. రోసనూరు గ్రామం నుంచి నెలబల్లి మీదుగా నాయుడుపేటకు గ్రావెల్ తీసుకెళుతున్న టిప్పర్లు ఓవర్ లోడ్‌తో పాటు, సరైన బిల్లులు లేకపోవడంతో జరిమానా విధించి సోమవారం విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16: స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి సమీపంలోని బస్‌షెల్టర్‌లో సోమవారం ఓ వ్యక్తి మృతి చెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. స్థానిక పీఎస్ఆర్ పార్కు ప్రాంతానికి చెందిన ముక్తియార్(60)గా గుర్తించారు. అతనికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తరచూ ఇంటి నుంచి వెళ్లిపోతూ ఉంటాడని, ఆరోగ్యం సరిగా లేక మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

చిల్లకూరు, సెప్టెంబరు 16: మండలంలోని తమ్మినపట్నం, గుమ్మళదిబ్బ గ్రామాల్లో సోమవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు డాక్టర్ సుహర్షన్‌రెడ్డి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలే బీజేపీ టార్గెట్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16: ప్రతి నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకుని నమోదు చేయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు, నాయకులు ఏగేశ్వరరావు, దామ గురుప్రసాద్, వర ప్రసాదు, బాలాజీ పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16: స్థానిక అడివయ్య కాలనీలోని గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో సోమవారం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి నిరాధరణకు గురైన వారికి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూరపాటి రవీంద్ర బాబు, బాషాజాన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పల్లకీసేవ


పల్లకీసేవలో గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామి

గూడూరు, సెప్టెంబరు 16: స్థానిక రైల్వేక్వార్టర్స్ సమీపంలోని వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ గణపతి హోమం, పూర్ణాహుతి పూజలు జరిపారు. అనంతరం గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెళ్లకూరు సెప్టెంబరు 16: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ కే నాగరాజు పట్టుకున్నారు. మండలంలోని కలవకూరు స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సోమవారం సమాచారం రావడంతో ఎస్ఐ కే నాగరాజు దాడులు చేసి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసా దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

గూడూరు, సెప్టెంబరు 16: పట్టణంలో సోమవారం ముస్లింలు మిలాద్‌ఉన్‌నబీ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక దర్గా సమీపంలోని చిన్నమసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పట్టణంలో పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు.

ఓజిలి: మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకున్నారు. ఓజిలితో పాటు రాచపాళెం, కార్మిమేడు, కురుగొండ గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కాలువలు పూడ్చివేసి... గ్రావెల్ తరలించి..!


చెందోడు వద్ద గంగకాలువను పూడ్చివేసి పొలంగా మార్చిన దృశ్యం

కోట, సెప్టెంబరు 12: కోట మండల పరిధిలోని తెలుగు గంగ కాలువలను కొందరు రైతులు పూడ్చివేస్తున్నారు. అలాగే కొందరు కాలువల పక్కన గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోట మండలానికి 7వ బ్రాంచ్ కెనాల్ నుంచి కొండుగుంట వరకు గంగనీరు వస్తుంది. అక్కడ నుంచి బ్రాంచ్ కాలువల ద్వారా కోట మేజర్, కర్లపూడి మేజర్ కాలువల ద్వారా మండలంలోని పలు చెరువులు, మెట్ట పొలాలకు వెళ్తుంది. అయితే రెండేళ్లుగా కేశవరం, చిట్టేడు, గూడలి సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువ కుడి ఎడమల నుంచి వేలాది రూపాయల విలువచేసే గ్రావెల్‌ను అక్రమార్కులు రాత్రికిరాత్రే టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. దీంతో గంగకాలువలు బలహీనపడి పూడిపోతాయనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా కోట మేజర్ కాలువ నుంచి చెందోడు మీదుగా కర్లపూడి మేజర్ గంగకాలువ వెళ్తుంది. ఈ కాలువ మొదట్లో 11.8 కిలోమీటర్లు కర్లపూడి వరకు కాలువ నిర్మాణం జరగాల్సి ఉంది. అయితే కోట మేజర్ నుంచి పెన్నక్కచెరువు వరకు 3.8 కిలోమీటర్లు కర్లపూడి మేజర్ కాలువ తవ్వారు. ఈ కాలువల కోసం భూములు కోల్పోయిన రైతులకు 2009-10లోనే పరిహారం చెల్లించారు. అయితే ఈ ప్రాంతంలో భూములకు మంచి గిరాకీ ఉండటంతో గంగకాలువలు సైతం పూడ్చివేసి పొలాలుగా మార్చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఈ వ్యవహారం జరుగుతూ ప్రస్తుతం సర్దుమణిగి ఉంది. రెవెన్యూ, తెలుగుగంగ అధికారులు కాలువలు పూడ్చివేసిన వారికి హెచ్చరికలు జారీచేసినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా గంగకాలువలను పూడ్చి వ్యవసాయ భూములుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే గంగనీరు మండలానికి రావడం కష్టతరంగా మారుతుంది. దీంతో వేలాది ఎకరాలు బీళ్లుగా మారే ప్రమాదం ఉంది. సంబంధింత అధికారులు స్పందించి కాలువల పూడ్చివేతతో పాటు గ్రావెల్ తరలింపును అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై తెలుగుగంగ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా కాలువల పూడ్చివేతలపై ఆరాతీస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వీధి కుక్కల బెడదతో జనం బెంబేలు

పీహెచ్‌సీల్లో అరకొరగా రేబిస్ టీకాలు


తోలిమిట్టలో కుక్కల గుంపు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16: వెంకటగిరి పట్టణంలో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, వృద్ధుల వెంట పడుతున్నాయి. చిన్న పిల్లలు అయితే భయంతో వణికిపోతున్నారు. రహదారుల వెంట నడిచి, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇక రాత్రి గంటలు దాటితే తిరిగే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 25వార్డుల్లో సుమారు 2వేల వరకు వీధి కుక్కలు ఉంటాయని అంచనా. బంగారుపేట, ఎన్టీఆర్ కాలనీ, క్రాస్‌రోడ్డు, మల్లమ్మగుడి వీధి, తోలిమిట్ట, పీర్జాతీ పేట, మార్కెట్ వీధి, కాంపాళెం తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల తొలిమిట్టలో ఓ పిచ్చి కుక్క ముగ్గురిని గాయపరించింది. అధికారులకు ఫిర్యాదు చేసినా సమయానికి స్పందించలేదని, చాలా సేపటి తరువాత మున్సిపాలిటీ సిబ్బంది వచ్చి పిచ్చి కుక్కను పట్టుకుని తీసుకుని వెళ్లారు. అలాగే ఇటీవల ఓ వ్యక్తి కుక్క కరిచిందని పట్టణంలోని సీహెచ్‌సీకి వెళ్తే అక్కడి సిబ్బంది పట్టించుకోలేదని, దీంతో ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకున్నామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని పీహెచ్‌సీల్లో రేబీస్ టీకాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి పట్టణంలో వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని, అలాగే పీహెచ్‌సీల్లో రేబీస్ టీకాలు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ప్యాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

నాయుడుపేట, సెప్టెంబరు 16: నాయుడుపేట రైల్వే స్టేషన్ అభివృద్ధే లక్ష్యంగా సదరన్ రైల్వే ప్యాసింజర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని అధ్యక్షుడు మస్తాన్ తెలిపారు. నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ పథకం కింద అభివృద్ధి చేయాలని, స్టాపింగ్‌లేని పలు రైళ్లను ఆపేందుకు చర్యలు తీసుకునేలా అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలసి విన్నవించారు. స్పందించిన ఆయన సదరన్ రైల్వే డీఆర్ఎంవీ విశ్వనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమొ రైల్‌ను నాయుడుపేట వరకు కొనసాగించాలని వైస్ ప్రెసిడెంట్ ఆర్ రాఘవన్ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఆర్ఎంవీ త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెంగాళమ్మ ఆలయంలో 3 నుంచి దేవీ శరన్నవరాత్రులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు తెలిపారు. ఒక్కొక్కరోజు ఒక్కో అవతారంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబరు 3న పరమేశ్వరి అలంకారం, 4న గాయత్రీ దేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న బాలత్రిపుర సుందరి, 7న అష్టకాళి, 8న మహాలక్ష్మి, 9న సరస్వతి, 10న దుర్గాదేవి, 11న రాజరాజేశ్వరి, 12న మహిషాసుర మర్ధిని అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు


గాయపడిన సుజిత్ - ప్రమాదానికి గురైన వాహనం

చిల్లకూరు, సెప్టెంబరు 16: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... నెల్లూరు నుంచి నాయుడుపేట మండలం మేనకూరుకు గ్లాజ్ లోడుతో వెళుతున్న టాటా ఏస్ వాహనం క్రాస్‌రోడ్డు వద్ద టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుజిత్‌కు గాయాలయ్యాయి. అతడిని హైవే అంబులెన్స్ సిబ్బంది గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం


చెక్కులు అందుకున్న పేద విద్యార్థులు

కోట, సెప్టెంబరు 16: ప్రతిభా పాటవాలు కలిగి చదువుకోవాలనే తపన ఉన్న పేద విద్యార్థులను దాతల సహకారంతో ఆదుకొని అండగా ఉంటామని షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, సీతారామ ధార్మిక సేవాసంస్థ ప్రతినిధి డీవీ అనంతాచార్యులు హామీ ఇచ్చారు. కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మకాలనీలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పది మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున 30వేల చెక్కులను అల్లం రమణయ్య, డీవీ అనంతాచార్యుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో సుధీర్‌శర్మ, శేషాద్రిశర్మ, చంద్రమౌళీశ్వర శర్మ, నంద, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16: పట్టణంలోని ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ సోమవారం వాకాడు మండలం జాంగ్రపేట గ్రామానికి చెందిన శ్రీనాథ్ అనే విద్యార్థికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రామ్మోనరావు, ప్రభాకర్, పెంచలయ్య, శ్రీనివాసులు, విజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి ఆర్థిసాయం అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

వేడుకగా వినాయక నిమజ్జనం


నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

గూడూరు, సెప్టెంబరు 16: స్థానిక ముత్యాలపేటలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, తెనాలి బ్యాండు, తప్పెట్లు, యువత చిందుల నడుమ పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నెలవలకు సన్మానం



నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 16: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డిలను ఇటుక బట్టీల యజమానులు సోమవారం సన్మానించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో ఇటుక బట్టీ యజమానులు రామయ్య నాయుడు, జీవీఆర్ నాయుడు, సాయి పాల్గొన్నారు.

కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

నాయుడుపేట, సెప్టెంబరు 16: నాయుడుపేట మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ సాధుశాంతి కుమారుడు సాయినవీన్(37) అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణంలోని రాజగోపాలపురంలో సోమవారం సాయి నవీన్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కౌన్సిలర్లు పాలేటి నాగార్జున, షబ్బీర్, దారా రవి నివాళులర్పించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొని సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు గ్రామంలో ప్రధాన వీధి నుంచి పొలాల్లోకి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొన్నాయి. దీంతో చిన్నపాటి వర్షమొచ్చినా, గాలివీచినా కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని గ్రామ స్తులు చెబుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రతినెలా లైన్ల మరమ్మతులు చేపడుతున్నా ఈ స్తంభాలకు అల్లు కొన్న చెట్ల తీగలను తొలిగించకపోవడం పట్ల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జంతు బలులను నిషేధించాలి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16: జంతు బలులను నిషేధించాలని సుభాష్ పిరమిడ్ ధ్యాన మందిరం నిర్వహకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాంసం ఆహారం కాదన్నారు. వేల సంఖ్యలో జంతువులు బలి అవుతున్నాయని, ఈ సంస్కృతిని అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: శ్రీ కాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమ వారం వేదోక్తంగా పూజలు నిర్వహిం చారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజ యుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. బిల్వపత్రాలు, గజమాలతో స్వామివారిని అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు

ట్రాక్టర్ దగ్ధం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: తొట్టంబేడు మండలం చియ్యవరంలో ట్రాక్టర్ దగ్ధమైంది. రైతు వి.మాధవయ్య తెలిపిన వివరాలు... పొలం పనుల్లో ట్రాక్టర్‌ను వినియోగించిన అనంతరం మధ్యాహ్నం అక్కడే ఉంచి భోజనానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ట్రాక్టర్ కాలిపోవడాన్ని గమనించాడు. చుట్టుపక్కల పొలాల రైతులతో కలిసి ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. అధికారులు స్పందించి తనకు ప్రభుత్వం నుంచి పరిహారం అందే విధంగా చూడాలని రైతు కోరుతున్నాడు.

కంటి వైద్య ఉచిత శిబిరం



ఏర్పేడు, సెప్టెంబరు 16: మండలంలోని వికృతమాలలో రాష్ట్రీయ సేవా సమితి, రాస్ మహిళా భారతి సంయుక్త సౌజన్యంతో నవజీవన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించి 45మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. రాస్ ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి, మాజీ సర్పంచ్ హేమాక్షిరాయల్, డాక్టర్ లీలాకుమరి, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తిలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో పట్టణంలోని భరద్వాజతీర్థంలో ఉన్న వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి దుస్తులు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ కె.గోపాల్, జి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: పట్టణంలోని వీఎంపల్లి వద్ద కొలువై ఉన్న గంగమ్మ ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి, సన్నీ, లక్ష్మణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: ఉత్తమ ఉపాధ్యాయుడిగా నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు పొందిన జి.మురళిని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు సోమవారం తన స్వగృహంలో సత్కరించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి జాతీయ స్థాయి అవార్డు పొందిన మురళి అందరికీ ఆదర్శమన్నారు. విద్యార్థులనుమంచి పౌరులుగా తీర్చిదిద్దగలిగేది ఒక ఉపాధ్యాయుడేనని తెలిపారు. ఈకార్యక్రమంలో జె.గురవయ్య, హరిబాబునాయుడు, గోపి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ఉపాధి పనులు

కేవీబీపురం, సెప్టెంబరు 16: మండలంలో ఉపాధి పనులు జోరందుకున్నాయి. నెల రోజులుగా పనులు లేక కూలీలు ఇబ్బంది పడ్డారు. గత వారం కురిసిన వర్షాలకు భూమి మెత్తపడడంతో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఫారంపాండ్, పంట కాలువల్లో పూడిక తీత తదితర పనుల్లో కూలీలు నిమగ్నమయ్యారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కేవీబీపురం, సెప్టెంబరు 16: మండలంలోని ఓళూరు, అంజూరు, రాగిగుంట తదితర గ్రామాల్లోని ముస్లింలు మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షాలు బాగా కురిసి పంటల బాగా పండి మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు నిర్వహించారు.

మట్కా స్థావరాలపై దాడి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: పట్టణంలో మట్కా, లాటరీ స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. పట్టణంలోని పలుచోట్ల లాటరీ టిక్కెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు రెక్కీ నిర్వహించి పక్కా సమాచారంతో శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి సిబ్బందితో కలిసి పలు స్థావరాలపై దాడి చేశారు. పట్టణంలోని భేరివారి మండపం వద్ద కొందరు మట్కా, లాటరీ నిర్వహిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రధాన నిర్వాహకుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలిసింది.

కొబ్బరి చిప్పల సేకరణకు టెండర్ల ఆహ్వానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాహుకేతుపూజా మండపాల్లో భక్తులు ద్వారా వచ్చిన కొబ్బరిచిప్పలను ప్రైవేటు వ్యక్తులు సేకరించుకునేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. రాహుకేతు మండపాల నుంచి వెలువడే కొబ్బరి చిప్పలను ఉన్నవి ఉన్నట్లుగా ప్రైవేటు వ్యక్తులు తీసుకెళ్లేందుకు మంగళవారం సాయంత్రం లోగా ఆలయ పరిపాలన భవనంలో ఎవరైనా కొటేషన్లు సమర్పించ వచ్చన్నారు.

పుత్తూరు వార్తలు

టీడీపీ నాయకుడి తల్లికి ఎమ్మెల్యే నివాళి

వడమాలపేట, సెప్టెంబర్ 16: మండల టీడీపీ అధ్యక్షుడు జానా వెంకటయ్య తల్లి లక్ష్మమ్మ భౌతికకాయానికి ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ధనంజయులు నాయుడు, మాధవయ్య, దాముయాదవ్, పెద్దబ్బరాజు, గణపతి రాయల్, ఉమాపతిరావు, హేమాద్రి నాయుడు, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నాన్న బాటలో నగరి అభివృద్ధికి కృషి: భానుప్రకాష్



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 16: తన తండ్రి, దివంగత గాలి ముద్దుకృష్ణమ అడుగు జాడల్లో నడుస్తూ నగరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. సోమవారం పుత్తూరు తాలుకా పెన్షనర్ల సంఘ భవనంలో సంఘ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా వారు 5 ఏళ్లుగా ప్రభుత్వం రావాల్సిన పింఛన్ బకాయిలు, తదితర సమస్యలను ఏకరవు పెట్టారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రతినెలా 1న పింఛన్లు అందజేస్తున్న ఘనత టీడీపీదేనని తెలిపారు. సంఘ అధ్యక్షుడు భాస్కర్ రాజు, కార్యదర్శి కుప్పయ్య, గౌరవాధ్యక్షులు యుగంధర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు డీఎన్ ఎలుమలై, మాధవయ్య, టీడీపీ పట్టణ కార్యదర్శి ఎన్‌ఎన్.ధనపాల్, పారిశ్రామికవేత్త శోభారాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ రూట్లో డ్రైవింగ్... పద్మవ్యూహమే

సత్యవేడు, సెప్టెంబరు 16: సత్యవేడు-నాగలాపురం వయా టీపీకోట మార్గంలో ప్రయాణం ప్రయాణికులకు నరకప్రాయమైతే, డ్రైవర్లకు ఓ పద్మవ్యూహంలా మారింది. సత్యవేడు నుండి టీపీకోట మీదుగా నాగలాపురం మార్గంలో 25 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు విస్తరణ కోసం రూ.34 కోట్లతో పనులు చేపట్టేందుకు పీఎల్ఆర్ కంపెనీ పనులు దక్కించుకుంది. అప్పటి మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి చేతుల మీదుగా భూమిపూజ కూడా నిర్వహించారు. అయితే భూమిపూజ చేసి పనులు చేపట్టకుండా చేతులు దులుపుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్నాళ్ళు రోడ్డుపై ఒక తట్టమట్టి కూడా వేయలేదు. దీంతో ఐదేళ్లగా ఈ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ఇదిలా ఉండగా ఈ మార్గంలో తిరిగే ఆర్టీసీ సర్వీసులకు ప్రతిరోజు చిక్కులు తప్పడం లేదు. డిపో నుంచి బయలుదేరిన బస్సు మళ్ళీ డిపోకు వచ్చి చేరేంత వరకు డ్రైవర్లుకు అగ్ని పరీక్షలా తయారైంది. ఈ గుంతల్లో వాలుతూ, తూలుతు వెళుతున్న బస్సుల్లో నుంచి ప్రతి రోజు మార్గమధ్యంలో ఏదోఒక పార్ట్ విరిగి పోవడం, బ్రేక్‌డౌన్‌లు జరగడం సర్వసాధారణంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి టీపీకోట రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రేక్‌డౌన్‌తో రోడ్డుపై నిలిచిపోయిన బస్సులు (ఫైల్ ఫొటోలు)

ఆగమోక్తం... పవిత్రోత్సవం



పూజా ద్రవ్యాలు - పూజాద్రవ్యాలు తీసుకెళ్తున్న అర్చకులు - పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: ముక్కంటీశుడి ఆలయంలో పవిత్రోత్సవాలు నాల్గో రోజు సోమవారం ఆగమోక్తంగా జరిగాయి. నిత్యపూజల్లో జరిగే దోషాలను నివారించేందుకు యేటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయంలోని యాగశాల వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవ మూర్తులను ఉంచి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ముక్కంటి ఆలయంలో కొనసాగిన రద్దీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. వరుస సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 33 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,236మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,584మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,726మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,454, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 468మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 286మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 69మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,993 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామిఅమ్మవార్లను ఉయ్యాలపై అధిష్టింపజేశారు. ఊంజల్ సేవను చూసి భక్తులు తరించారు. ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకల కోసం క్యూలైన్ల తొలగింపు

పల్లికొండేశ్వరాలయంలో వైసీపీ నేత నిర్వాకం



ప్రదోష మండపం వద్ద వైసీపీ నేత కట్ చేసిన గ్రిల్ అడుగు భాగం - తొలగించిన గ్రిల్ మళ్లీ దారంతో కట్టి పెట్టిన దృశ్యం

నాగలాపురం, సెప్టెంబరు 16 : సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మాజీ ఛైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి మరో నిర్వాకం వెలుగు చూసింది. ప్రదోష మండపంలో తన కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు అడ్డుగా ఉందని దాతల సాయంతో ఏర్పాటు చేసిన క్యూలైన్లను కట్ చేసి తొలగించిన వైనం బయటపడింది. నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో వున్న ప్రదోష మండపంలో ఆదివారం వైసీపీ నేత బాలాజీ రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకలు జరిగిన విషయం తెలిసిందే.వచ్చిన బంధుమిత్రులను ఏకంగా కుర్చీలు వేసి కూర్చోబెట్టడం విమర్శలపాలైంది.వేడుకలను వీక్షించేందుకు అడ్డుగా ఉందని ప్రదోష మండపం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టీల్ క్యూలైన్లను కట్ చేసి తొలగించి వుండడం సోమవారం చూసినవాళ్లంతా నోరెళ్లబెట్టారు.ఆలయంలో జరిగే ప్రదోష పూజలకు, మహా శివరాత్రి వంటి విశేష రోజుల్లో భక్తుల రద్దీని కట్టడి చేసేందుకు నలుగురు దాతలందించిన సుమారు 15 లక్షల రూపాయలతో స్టీల్ గ్రిల్స్‌తో ఆలయంలో పలు చోట్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు.అటువంటి క్యూలైన్లను తొలగించడంపై భక్తులు మండిపడుతున్నారు. ఆలయ సిబ్బంది క్యూలైన్‌ను కట్ చేయవద్దని అభ్యంతరం తెలిపినా కూడా తొలగించినట్లు సమాచారం.రాష్ట్రంలో ప్రభుత్వం మారి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంకా వైసీపీ నేతల హవా కొనసాగుతుండడం, అధికారులు ఇంకా వారి చెప్పు చేతల్లోనే ఉన్నారనడానికి ఈ వుదంతం ఓ నిదర్శనం. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాలాజీరెడ్డి పల్లికొండేశ్వరాలయ ఛైర్మన్‌గా సంస్కరణల పేరుతో ఎన్నో అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడంపై అప్పట్లో వివాదాలు చెలరేగాయి. అయితే ఆయన పలుకుబడి కలిగిన నాయకుడవడంతో అధికారులు వారించే సాహసం చేయలేక పోయారు. అయితే ప్రభుత్వం మారినా ఆలయంలో ఆయన హవాయే ఇంకా కొనసాగుతుండడం ఆశ్చర్యకరం.

రెండు స్కూటర్ల ఢీ:ముగ్గురికి గాయాలు



గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి

ఏర్పేడు, సెప్టెంబరు 16: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు. నగరి నియోజకవర్గం పుత్తూరు కు చెందిన వినీత్, దిలీప్ ఫోటోగ్రాఫర్లు. వారు సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై సోమవారం వెంకటగిరికి బయలుదేరారు. మార్గమధ్యం ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద రహదారిపై వెళ్తుండగా వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 38 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి, వినీత్, దిలీప్ తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వాళ్లు వారిని ఏర్పేడు 108 అంబులెన్స్ ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి వద్ద ఉన్న రూ.1,920 నగదు, మొబైల్, ఉంగరాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వైద్యుడు రమేష్‌కు 108 సిబ్బంది అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

108 సర్వీసెస్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 16: 108 వాహనాల్లో పైలెట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిసుతన్నట్లు 108 సర్వీస్ జిల్లా మేనేజరు సందీప్ రెడ్డి తెలిపారు. పైలెట్ పోస్టులకు 35 సంవత్సరాలులోపు టెన్త్ ఉత్తీర్ణత, హెవీ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఈఎంటీ పోస్టులకు జీఎన్‌ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బి.ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు చదివిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు తమ దర ఖాస్తుల కోసం 108 సర్వీసెస్ జిల్లా కార్యాలయం, మున్సిపల్ పార్క్ రోడ్డు, మధురా నగర్ తిరుపతి చిరునామాలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



వెడ్చాటూరు, సెప్టెంబరు 16: వెడ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991-1992 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా యోగ క్షేమాలు, పాఠశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న తమ స్నేహితులకు ఆర్థిక సాయం అందిస్తామని, అలానే పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం తమకు పాఠాలు నేర్పిన గురువులను సన్మానించారు.

పీవీకండ్రిగలో తీరిన తాగునీటి సమస్య



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 16: మండలంలోని పీవీకండ్రిగ పంచాయతీలో తాగునీటి సమస్యను సర్పంచ్ కోటమ్మ సోమవారం పరిష్కరించారు. వారం రోజుల క్రితం తాగునీటి మోటరు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య తలెత్తింది. సమస్యను స్థానికులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో బోరు మోటరుకు మరమ్మతులు చేయించి తాగునీరు సరఫరా పునరుద్ధరించారు.

అంబేడ్కర్ భవన్‌లో గదులను ఖాళీ చేసిన వైసీపీ నాయకులు

ఏర్పేడు, సెప్టెంబరు 16: మండలంలోని మర్రిమంద పంచాయతీలో 2019 ముందు టీడీపీ ప్రభుత్వంలో 12 సెంట్లు స్థలాన్ని అప్పటి ప్రభుత్వం అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించింది. ఆ సమయంలో స్థానిక దళితసంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసుకున్నారు. అలాగే రెండు గదులను నిర్మించారు. ఆ రెండు గదులను వైసీపీ నేతలు అద్దెకు తీసుకున్నారు. అయితే అద్దె చెల్లించ లేదు. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నేత దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన దళిత సంఘాల నాయకులతో కలిసి రెండు గదులను సోమవారం ఖాళీ చేయించారు.

వైభవంగా భేరివారి మండప వినాయక నిమజ్జనం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: పట్టణంలోని భేరివారి మండపం వద్ద ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమను సోమవారం నిమజ్జనం చేశారు. కొండమిట్ట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా తాము భేరివారి మండపం వద్ద చవితిని పురస్కరించుకుని వినాయక ప్రతిమను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరుడిగా చక్రేశ్వరస్వామి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో కొలువైఉన్న చక్రేశ్వరస్వామి సోమవారం అర్ధనారీశ్వరుడుగా దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి అనంతరం అర్ధనారీశ్వరస్వామిగా అలంకరించి ధూపదీపనైవేద్యాలు సమర్పించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

యువకుడిపై దాడి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన వాగ్వాదంలో యువకుడిపై కొందరు దాడి చేశారు. సోమవారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద దక్షిణకైలాసధామం శ్మశానం సమీపంలో జరిగింది. పట్టణంలోని దోబీఘాట్‌కి చెందిన శ్రీనివాసులు(22) కొయ్య పనులు చేస్తుంటాడు. దోబీఘాట్ వద్ద ఆదివారం వినాయక నిమజ్జనం జరిగింది. కార్యక్రమానికి ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన రమేశ్ హాజరయ్యాడు. ఈ క్రమంలో శ్రీనివాసులు, రమేష్ వాగ్వాదానికి దిగారు. రమేశ్, మరో నలుగురిని వెంటబెట్టుకుని ఇరిగేషన్ కార్యాలయం వద్ద వెళుతున్న శ్రీనివాసులుపై దాడి చేశారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు.

ముక్కంటి సేవలో గుంటూరు డీఈవో

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం గుంటూరు జిల్లా డీఈవో పి.శైలజ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.